సాక్షి
కాకినాడ
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



అన్నదానానికి రూ.లక్ష విరాళం


సామర్లకోట: స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి చావలి సూర్యనారాయణ శాస్త్రి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు.



అన్నదానానికి మేము సైతం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కేవీ రాఘవరావు, లక్ష్మి దంపతులు సోమవారం రూ.1,00,016 విరాళాన్ని సమర్పించారు.

డెల్టాలకు 6,250 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 6,250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,850, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,200 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.70 అడుగులకు చేరింది.



న్యూస్‌రీల్

నాగబాబు కుటుంబానికి సాయం

కాకినాడ సిటీ: ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామ రైతు భరోసా కేంద్రంలో పశుసంవర్ధకశాఖ సహాయకునిగా పనిచేసి అనారోగ్యంతో మరణించిన కుంజు నాగబాబు కుటుంబానికి ఆ శాఖ సిబ్బంది బాసటగా నిలిచారు. రూ.లక్ష సేకరించి కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా సోమవారం మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్ సూర్యప్రకాశరావు, పశుసంవర్ధకశాఖ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ సిహెచ్ వినోద్, డాక్టర్ యశ్వంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 268 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి 268 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, కెఎస్ఈజెడ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె మనోరమ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీత పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాబ్‌టాప్‌లు పంపిణీ

కాకినాడ సిటీ: విభిన్న ప్రతిభావంతుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నలుగురు విభిన్న ప్రతిభావంతులకు ల్యాబ్‌టాప్‌లు అందజేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న ఉపకరణాల ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయి ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. రూ.35 వేల చొప్పున రూ.1.40 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లను రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ సహకారం అందజేసినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, దివ్యాంగుల కౌన్సిలింగ్ రిహాబిలిటేషన్ అధికారి వై శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశం

కాకినాడ క్రైం: ఇంఛార్జి డీఎంహెచ్‌వో రోణంకి రమేష్‌తోపాటు, డీఎంహెచ్‌వో కార్యాలయ ఇంఛార్జి ఏవో సూర్యచంద్రలపై కలెక్టర్ కృతికా శుక్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే డీఎంహెచ్‌వోకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సోమవారం ఆదేశించారు. ఏడు నెలలుగా ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు అందడం లేదు. డీఎంహెచ్‌వో సహా ఇంఛార్జి ఏవో నిర్లక్ష్యం కారణంగా జీతాలు కొన్ని నెలలుగా జమకాలేదని కలెక్టర్ తెలుసుకున్నారు. ఇందుకు బాధ్యులుగా డాక్టర్ రమేష్‌ను సరెండర్ చేస్తామంటూ హెచ్చరించారు. షోకాజ్ నోటీస్ జారీ చేయాలంటూ ఆదేశించారు. డీఎంహెచ్‌వో ఏవో స్పందనకు ఎందుకు రాలేదని డాక్టర్ రమేష్‌ను ప్రశ్నించారు. గత వారం జరిగిన స్పందనలో పలు అంశాలపై ఆదేశాలిచ్చినా అమలు కాలేదని మండిపడ్డారు.

కలెక్టర్‌ను కలిసిన జయలక్ష్మి సొసైటీ పాలకవర్గం

కాకినాడ సిటీ: జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలిశారు. సొసైటీకి సంబంధించి పలు విషయాలపై చర్చించారు. చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు మాట్లాడుతూ సొసైటీకి వసూలు కావల్సిన రూ 120 కోట్లుకు సంబంధించి డాక్యుమెంట్లు, గోల్డ్ విడుదల చేయించాలన్నారు. 9 బ్రాంచిలకు సంబంధించి తాళాలు ఇప్పించాలన్నారు. పాత సొసైటీలో నిల్వ ఖాతాలో సుమారు రూ. 6 కోట్లు విడుదల చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కలెక్టర్ కృతికా శుక్లా సానుకూలంగా స్పందించి సీఐడీ అధికారులు, ఎస్పీలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు చైర్మన్ వివరించారు.

పరిధి తగ్గి.. ప్రగతి పరుగులో నెగ్గి..

- విభజన తర్వాత పురోగమిస్తున్న జిల్లా
- దూరాభారం తగ్గడంతో సులభమైన లక్ష్యసాధన
- సూక్ష్మస్థాయిలో సమస్యలకు వెంటనే పరిష్కారం
- ఏడాదిలోనే చక్కగా కుదురుకున్న పాలన

సాక్షిప్రతినిధి,కాకినాడ: ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నూరుశాతం విజయవంతమైంది. పార్లమెంటరీ పరిధిలో జిల్లా ఏర్పాటు చేసి ప్రజలకు పాలన చేరువ చేయాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరింది. 60 మండలాలతో ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లానుంచి కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్అంబేద్కర్ కోనసీమ (మూడు జిల్లాలు)గా విడిపోయి చిన్న జిల్లాలుగా ఏర్పడి నేటికి ఏడాదైంది. గడచిన ఏడాదిలో కొత్త జిల్లా ఫలాలను ప్రభుత్వం ప్రజల ముందుంచగలిగింది. దూరాభారం తగ్గడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతేడాది సరిగ్గా ఇదేరోజున 21 మండలాలతో కాకినాడ కేంద్రంగా జిల్లా ఏర్పడింది. కాకినాడపై గతంలో ఉన్న పరిధి భారం తగ్గింది. దశాబ్దాల పాటు ఎన్నో బరువు, బాధ్యతలను భుజాన వేసుకున్న కాకినాడ ఈ ఏడాదిలో చిన్న జిల్లాగా చక్కని పురోగతి సాధించగలిగింది.

బాలారిష్టాలు అధిగమించి

జిల్లాల పునర్విభజనతో కొత్త కలెక్టరేట్లకు భవనాలు ఎక్కడి నుంచి వస్తాయి..కనీసం కుర్చీ, టేబుళ్లయినా ఏర్పాటుచేస్తారా అని ప్రతిపక్షాల నాయకులు తొలినాళ్లలో విమర్శలు చేశారు. ఒకటి రెండు నెలలు తిరగకుండా ప్రభుత్వం ఒక్కొక్కటీ సమకూర్చడంతో వీరి నోళ్లు మూతపడ్డాయి. బాలారిష్టాలను త్వరగా అధిగమించేలా జగన్ సర్కారు చర్యలు తీసుకోవడంతో సఫలీకృతమైంది. అలాగే శాఖల వారీగా అధికారులు, ఉద్యోగులను విభజించి ఇబ్బంది కలుగకుండా సర్దుబాటు చేయగలిగింది. ఆరంభంలోనే పాలన ఊపందుకోవడంతో ప్రజల ప్రశంసలకు పాత్రమైంది.

సులభమైన క్షేత్ర పర్యటన

నియోజకవర్గాల సంఖ్య తగ్గడంతో జిల్లా పరిధి కూడా పరిమితమైంది. ఫలితంగా మెరుగైన పాలన అందించేందుకు మార్గం సుగమమైంది. ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించడం సాధ్యమైంది. రోజుల వ్యవధిలోనే తమ అర్జీలకు పరిష్కారం లభిస్తోందని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాగా ఉన్నప్పుడు ఏ మూల ఏ మండల పర్యటనకు వెళ్లినా అధికారులు మర్నాడే తిరిగి కార్యాలయానికి చేరేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జిల్లా కలెక్టర్ సహా జిల్లా స్థాయి అధికారులు రెండు, మూడు గంటల్లో క్షేత్ర స్థాయిలో పర్యటన పూర్తి చేసుకోగలుగుతున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని వికేంద్రీకరిస్తున్నారు. మండల, నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్నారు.

ప్రజల వద్దకు స్పందన

గతంలో సగటున 50కిలోమీటర్లు కిలోమీటర్లు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి వెళ్లి అర్జీలు అందించేవారు. ఇప్పుడు ప్రతి నెల మొదటి సోమవారం ఏదో ఒక నియోజకవర్గం లేదా, మండల కేంద్రంలో స్వయంగా జిల్లా కలెక్టర్ సహా అన్ని శాఖల జిల్లా అధికారులు వచ్చి స్పందన నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో స్పందనకు కనీసంగా 300 గ్రీవెన్స్ వస్తుంటే 200పై చిలుకు సమస్యలు 48 గంటల్లోనే పరిష్కారం చూపుతున్నారు. గడచిన ఏడాదిలో జిల్లాలోని సగం మండలాల్లో స్పందన నిర్వహించగలిగారు. జిల్లాలో వచ్చిన 3012 వినతులకు గాను 2,982 పరిష్కారమయ్యాయి.



తునిలో అర్జీ స్వీకరిస్తూ వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా



ఉప్పాడలో మహిళా మార్టును ప్రారంభిస్తున్న మంత్రి ముత్యాలనాయుడు (ఫైల్)



జిల్లా స్వరూపం గణాంకాల్లో ..

విస్తీర్ణం	3019.8 చ.కి.మీ.
జనాభా	21,88,413 మంది
రెవెన్యూ డివిజన్లు	02
మండలాలు	21
కార్పొరేషన్	01
మున్సిపాలిటీలు	04
నగర పంచాయతీలు	02
గ్రామ పంచాయతీలు	385
ఓటర్లు	15,98,926
పురుషులు	7,90,538
మహిళలు	8,08,149

పురోగతిలో మచ్చుకు కొన్ని..

- జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాల పురోగతి వేగం అందుకుంది.
- సమగ్ర భూ సర్వే మొదటి విడత పరిశీలిస్తే 448 గ్రామాలకు గాను 25శాతానికి పైగా పూర్తయింది. రెండో విడత మరో 23 గ్రామాల్లో సమగ్ర భూ సర్వే పూర్తి చేసి రికార్డు సృష్టించింది.
- రాష్ట్రంలో మరే జిల్లాలోని సాధ్యం కాని రీతిలో ఏడాది తిరగకుండానే యూ కొత్తపల్లి, తొండంగి, కిర్లంపూడి, తాళ్లరేవులలో ఏర్పాటైన మహిళా మార్టులు రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయి.
- సామర్లకోటలో 300 మంది మహిళలకు ఉపాధి కల్పించేలా స్టిచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. రెండు వేల స్వయంశక్తి సంఘాలకు ఇది చేయూతనివ్వగలుగుతోంది.
- **నవరత్నాలు–పేదలకు ఇళ్ల పథకం కింద తొలి దశలో 17 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. తొలి విడత జిల్లా లక్ష్యం 18వేలు. ఈ నెలాఖరు నాటికి ఇవి గృహప్రవేశాలకు ముస్తాబవుతు**న్నాయి.
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రతిష్టాత్మకమైన బల్క్‌డ్రగ్ పార్కు మంజూరైంది.
- లీఫియస్ ఫార్మా పెన్సిలిన్–జి ప్రాజెక్టు కెఎస్‌ఈజడ్‌లో ఏర్పాటుకు మార్గం సుగమమైంది.
- భారతమాల ప్రాజెక్టులో భాగంగా కాకినాడ నుంచి అన్నవరం వరకు జాతీయ రహదారి రోడ్డు ఏర్పాటుకానుంది.
- కాకినాడ సెజ్ తొండంగి తీరంలో కాకినాడ గేట్ వే పోర్టు, ఉప్పాడలో ఫిషింగ్‌హార్బర్, కాకినాడలో ఇండియన్ ఇనిస్టిట్యూట్‌ఆఫ్‌ఫారెన్ ట్రేడ్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు ఇటీవల గ్రీన్ సిగ్నల్ లభించింది.
- కాకినాడ యాంకరేజ్ పోర్టులో సుమారు రూ.100 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- రూ.12 కోట్ల సబ్సిడీతో 1638 మంది రైతులకు 1368 వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేశారు
- మత్స్య ఉత్పత్తులు పెంచేందుకు 28 మిని ఫిష్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటయ్యాయి.
- ఫ్యామిలీ డాక్టర్ కింద 15 కొత్త 104 వాహనాలు సత్వర వైద్యసేవలు అందిస్తున్నాయి.

నూరుశాతం నెరవేరిన లక్ష్యం



ప్రభుత్వ లక్ష్యం నూరుశాతం నెరవేరింది. మునుపటికంటే మెరుగైన, వేగవంతమైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవడమే కాకుండా 48 గంటల్లో వాటి పరిష్కారానికి ప్రస్తుతం ఉన్న జిల్లా పరిధి ఎంతగానో సహకరిస్తోంది. 21 మండలాలతో పరిధి చిన్నది కావడంతో ప్రజలకు ఎటువంటి జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం లభించింది.

- కృతికాశుక్లా, జిల్లా కలెక్టర్

రత్నగిరిపై ఆటోలకు గ్రీన్‌సిగ్నల్

ముగ్గురిని మాత్రమే ఎక్కించాలని షరతు

అన్నవరం: రత్నగిరిపైకి ఆటోలను సోమవారం నుంచి అనుమతించారు. ముగ్గురిని మాత్రమే ఆటోలో ఎక్కించాలనే నిబంధన అమలు చేయాలని స్పష్టం చేశారు. బేబీ సీటు (పొడవాటి చెక్క సీటు) తొలగిస్తేనే రత్నగిరికి ఆటోలు అనుమతిస్తామని అధికారులు అభ్యంతరం చెప్పడంతో నాలుగు రోజులుగా ఆటో డ్రైవర్లు తమ ఆటోలను నిలిపివేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం 'రత్నగిరికి మళ్లీ ఆటోల బంద్' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ స్పందించారు. బేబీ సీటు ప్రస్తావన లేకుండా కొన్ని షరతులు విధించి పాటించేలా ఆటోలను అనుమతించాలని ట్రాన్స్‌పోర్టు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మళ్లీ రత్నగిరి ఘాట్‌రోడ్‌లో ఆటోలు ప్రయాణించాయి. రత్నగిరికి ఆటోలను అనుమతించడంపై ఆటోయూనియన్ నాయకులు, గ్రామసర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా హర్షం వ్యక్తం చేశారు.



రత్నగిరిపై భక్తుల కోసం వేచియున్న ఆటోలు

నిబంధనలు ఇవీ

- రత్నగిరి దేవస్థానం టోల్‌గేట్‌లో తనిఖీలు మరింత కఠినతరం చేయాలని ఈఓ చంద్రశేఖర్ ఆదేశించారు. తిరుపతి అలిపిరి తరహాలో తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇందు కోసం నిబంధనలు విధించారు.

నిబంధనలు ఇలా..

- ఆటోలో ముగ్గురిని మించి ఎక్కించరాదు. డ్రైవర్లు తప్పని సరిగా నుదిటిన కుంకుమ, విభూది, గంధం, చందనంతో బొట్టు ధరించాలి.
- అన్యమత సామగ్రి, స్టిక్కర్లు, సిగరెట్, గుట్కా, మత్తు పానీయాలు, గంజాయి, గ్యాస్ సిలిండర్లు, వంట చెరకు, కుక్కర్లు, పోర్టబుల్ సౌండ్ బాక్స్‌లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు తీసుకువెళ్లరాదు.
- సెక్యూరిటీ సిబ్బంది జాగ్రత్తగా అన్ని వాహనాలను తనిఖీ చేసిన తరువాతనే రత్నగిరికి అనుమతించాలి.
- వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత మాత్రమే టోల్ ఫీజు వసూలు చేయాలి.
- రత్నగిరిపై హోటల్స్ నిర్వాహకులు మినహా ఇతరులు వంట సామగ్రి రత్నగిరికి తీసుకుని రాకూడదు.
- తిరుపతి అలిపిరి టోల్‌గేట్ తరహాలో తనిఖీలు నిర్వహించేందుకు ఈఈ నూకరత్నం అలిపిరి టోల్‌గేట్‌ని పరిశీలించి మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలి.

సాక్షి ఇంపాక్ట్

ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు ప్రారంభం

కాకినాడ సిటీ: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి విద్యార్థుల..తల్లితండ్రుల హడావిడి కనిపించింది. విద్యార్థులందరూ తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకున్నారు. ఉదయం కాకినాడ సాలిపే నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 18వతేదీ వరకు పదోతరగతి పరీక్షలు జరుగుతాయి.

జిల్లావ్యాప్తంగా 136 పరీక్ష కేంద్రాల్లో 29,988 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సెంటర్లలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాల తరలింపు, తిరిగి సమాధాన పత్రాలు పోలీస్‌ఆఫీస్‌కు చేర్చే క్రమంలో అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు.



పదోతరగతి పరీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి కెఎస్‌విఎస అన్నపూర్ణ, మున్సిపల్ పాఠశాల చీఫ సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు ఉన్నారు. మొదటి రోజు తెలుగు పేపర్‌కు 28,086 మంది విద్యార్థులకు గాను 27,889 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కెఎస్‌విఎస్ అన్నపూర్ణ తెలిపారు.



తూరంగి పీహెచ్‌సీలో కోవిడ్ పరీక్ష కోసం శ్వాబ్ సేకరిస్తున్న ఎల్‌టీ



జీజీహెచ్‌లో ప్రత్యేక కోవిడ్ వార్డు

మళ్లీ కలకలం



పీఆర్ కళాశాలలో కోవిడ్ పరీక్షలు చేస్తూ

- ఉనికి చాటుకుంటున్న కోవిడ్
- రెండు వారాల్లో 14 మందికి పాజిటివ్
- భయం లేదంటున్న నిపుణుల భరోసా

కాకినాడ క్రైం: కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. రెండు వారాల వ్యవధిలో 14 మందిలో ఈ వైరస్ నిర్ధారణ అయింది. వారం రోజులుగా ఈ ఉధృతి మరింత ఎక్కువగా ఉంది. బాధితుల్లో ఎక్కువ మంది పెదపూడి మండలానికి చెందిన వారే ఉన్నారు. కాకినాడ గ్రామీణం, పిఠాపురం, పామర్రుకు చెందిన వారూ బాధితులుగా చికిత్స పొందుతున్నారు.

ఎందుకు పెరుగుతున్నాయంటే....

మాస్క్, శానిటైజర్, సామాజిక దూరాన్ని ప్రజలు పూర్తిగా విస్మరించడం కోవిడ్ కేసులు పెరగడానికి దోహదపడిందని వైద్య నిపుణులు అంటున్నారు. సెలవుల సమయం కావడం వరుస ప్రయాణాలు, రాష్ట్రాలు, దేశాల హద్దులుదాటి ప్రయాణించడం ఆయా ప్రాంతాల నుంచి స్వస్థలాలకు తిరిగి రావడం కోవిడ్ కేసులు పెరగడానికి కారణమని వైరాలజీ నిపుణులు తెలిపారు. తాజాగా గుర్తించిన 14 కోవిడ్ కేసుల్లో అసాధారణ లక్షణాల కారణంగా ఆరుగురి శాంపిళ్లను హోల్ జీనోమిక్ సీక్వెన్సింగ్‌కు పంపించారు. నివేదికలు కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. రానున్న నివేదికల ఆధారంగా కోవిడ్ వైరస్ వేరియంట్‌ను నిర్ధారించేందుకు వైరాలజీ నిపుణులు సిద్ధమవుతున్నారు.


లక్ష్యం 300 పరీక్షలు

ముందస్తు చర్యల్లో భాగంగా కోవిడ్ పరీక్షల సంఖ్యను పెంచాలంటూ ప్రభుత్వం జిల్లాలను ఆదేశించింది. రోజులో జిల్లాలో కనీసం 300 పరీక్షలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 37 పీహెచ్‌సీలు, 23 యూపిహెచ్‌సీలు మొత్తం 60 ఆరోగ్య కేంద్రాలుండగా ఒక్కో ఆరోగ్య కేంద్రానికి కనీసం 5 పరీక్షలు చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రస్తుతం ప్రతి రోజూ 50 నుంచి 70 మధ్య జిల్లాలో కోవిడ్ పరీక్షలు జరుగుతున్నాయి.

జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

కోవిడ్ రోగుల చికిత్స కోసం జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు అందుబాటులో ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి తెలిపారు. 13 వెంటిలేటర్లు, 24 పడకలతో ఉన్న ఈ వార్డు పల్మనాలజీ వైద్య నిపుణుల పర్యవేక్షణలో సేవలందిస్తుందని అన్నారు. ప్రస్తుతం రెండు కేసులు ఉన్నాయని తెలిపారు. ఉన్న పడకలకు అదనంగా మరిన్ని పడకలు అవసరం అయితే ఎస్ఆర్ఎంటీ భవంతిలోని పై అంతస్తులో మరో వార్డు సిద్ధం చేసి ఉంచినట్లు డాక్టర్ హేమలత తెలిపారు.

ప్రాణాపాయానికి ఆస్కారం లేదు



తాజా వేరియంట్ కారణంగా ప్రాణాపాయానికి ఆస్కారం లేదు. నిత్యం రూపాంతరం చెందే గుణం ఉండటం వల్లే కోవిడ్ వైరస్ పూర్తి నిర్మూలన సాధ్యం కాదు. బ్యాక్టీరియా, వైరస్‌లకు ఉండే సాధారణ లక్షణమే అది. పూర్తి స్థాయి వ్యాక్సినేషన్, హెర్డ్ ఇమ్యూనిటీ కారణంగా ప్రాణాంతకం కాదు. అతి తీవ్ర, తీవ్ర లక్షణాలకు అవకాశం లేదు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ కె.రాజేంద్రకుమార్, సీనియర్ పల్మనాలజిస్టు, విశ్రాంత హెచ్‌వోడీ, జీజీహెచ్

సిద్ధంగా ఉన్నాం...



కోవిడ్ వ్యాప్తిని సీరియస్‌గా పరిగణిస్తున్నాం. పాజిటివ్‌లు గుర్తించిన వారిని హోం ఐసోలేషన్‌లో ఉంచే చికిత్స అందిస్తున్నాం. పాజిటివ్ వచ్చిన 14 మందిలో ఇద్దరు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ పరీక్షల కిట్లు, మందులు అందుబాటులో ఉంచాం. పడకలు, ప్రాణవాయువు కొరతకు ఏ మాత్రం ఆస్కారం లేదు.

- డాక్టర్ రోణంకి రమేష్, ఇంఛార్జి డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

స్క్వాష్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నవీన్



నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): స్క్వాష్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా జిల్లాకు చెందిన ముత్తా నవీన్ ఎన్నికయ్యారు. ఈ నెల 2న నెల్లూరులో రాష్ట్ర స్క్వాష్ సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముత్తా నవీన్‌ను ఉపాధ్యక్షునిగా సభ్యులు ఎన్నుకున్నారు.

నవంబర్‌లో జరిగే 37వ జాతీయ క్రీడలకు ఏపీ జట్టు ఎంపికకు ముత్తా నవీన్‌ను కన్వీనర్‌గా రాష్ట్ర కార్యవర్గం నియమించింది. ప్రస్తుతం ఈయన జిల్లా స్క్వాష్ సంఘ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఈ సందర్భంగా నవీన్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ జూన్‌లో కాకినాడలో రాష్ట్ర స్థాయి స్క్వాష్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతీ జిల్లాలోను స్క్వాష్ క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన నవీన్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు చంద్రుగోవిందరాజు, కార్యదర్శి పద్మనాభం, జిల్లా స్క్వాష్ సంఘ కార్యవర్గ సభ్యులు అభినందించారు.

క్లుప్తంగా

249 సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను ఫిర్యాదీలకు అప్పగిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రజలు పోగొట్టుకున్న 249 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి, ఫిర్యాదీలకు మీడియా సమక్షంలో అప్పగించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా పోలీస్ శాఖ కొత్తగా పరిచయం చేసిన 'మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్' ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతోందని అన్నారు. ఈ సేవలో భాగంగా నిర్దేశిత మొబైల్ నంబరుకు మెసేజ్ చేయడం ద్వారా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్టు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దాని ఆధారంగా రెండు నెలల వ్యవధిలో 249 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీకి కృషి చేసిన ఐటీ కోర్ విభాగంతో పాటు సీసీఎస్ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

అభాగ్యులకు వరం.. మిషన్ వాత్సల్య

- చిన్నారులకు నెలకు రూ.4 వేల ఆర్థిక సహాయం
- దరఖాస్తుకు రేపటి వరకూ గడువు

ప్రత్తిపాడు రూరల్/బిక్కవోలు: విధి చిన్నచూపు చూసి, తల్లి, తండ్రి దూరమైన/కోల్పోయి, ఎటువంటి ఆదరణా లేని అభాగ్యులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారి విద్య, వైద్య అవసరాలను తీర్చేందుకు 'మిషన్ వాత్సల్య' పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్ చేస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10,500 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలోని ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు లేదా దూరమైన వారు, పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయినవారు), విడాకులు పొందిన తల్లిదండ్రులు ఉన్నవారు, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడిన, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం-2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల కార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహ, హెచ్ఐవీ బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.



వార్షికాదాయ పరిమితి

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించరాదు. జువనైల్ జస్టిస్ (జేజే) బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖిత పూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. స్పాన్సర్‌షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతి గృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లే వారి హాజరు 30 రోజులకు పైగా సక్రమంగా లేదని తేలినా, పరిశీలించి తాత్కాలికంగా నిలిపివేస్తారు.

మండల స్థాయి స్క్రూటినీ కమిటీ పరిశీలన

దరఖాస్తులను మూడు సెట్‌లుగా తయారు చేసి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇవ్వాలి. అక్కడి నుంచి ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయానికి అందిన దరఖాస్తులన్నింటినీ తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లతో కూడిన మండల స్థాయి స్క్రూటినీ కమిటీ పరిశీలిస్తుంది.

ఎంపిక చేసిన ప్రతి దరఖాస్తుపై కమిటీ సభ్యులందరూ సంతకం చేసిన తరువాత ఆ సమావేశం మినిట్స్‌తో పాటు దరఖాస్తులన్నిటినీ జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికార అధికారి కార్యాలయానికి సమర్పిస్తారు.

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు

- బాలుడి/బాలిక జనన ధ్రువీకరణ పత్రం
- ఆధార్ కార్డు
- తల్లి, తండ్రి ఆధార్ కార్డులు
- తల్లి, తండ్రి డెత్ సర్టిఫికెట్
- గార్డియన్ ఆధార్
- రేషన్ కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- బాలుడు, బాలిక పాస్‌పోర్టు సైజు ఫొటో
- స్టడీ సర్టిఫికెట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- బాలుడు లేదా బాలిక వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్ లేదా తల్లి/తండ్రి/సంరక్షకులతో కలిసిన జాయింట్ అకౌంట్ వివరాలు

వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించాం



'మిషన్ వాత్సల్య' పథకంపై వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించాం. అర్హులైన వారు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటాం.

– వెలగల విజయలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి, పందలపాక, బిక్కవోలు మండలం

ఉన్నతాధికారుల ఆదేశం



మిషన్ వాత్సల్య పథకం దరఖాస్తులు స్వీకరించాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ దరఖాస్తులు తీసుకోవాల్సిందిగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశాలు ఇచ్చాం. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను ప్రాజెక్టు అధికారులకు అందించాం. – శాంతి రత్నకుమారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్, ఊలపల్లి, బిక్కవోలు మండలం

దరఖాస్తుల స్వీకరణ



స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. నిరాదరణకు గురైన వారి నుంచి ఈ నెల 5 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తాం. సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్, మహిళా పోలీసులు ఈ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం వాటిని సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలి. వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ కమిటీ పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – టి.పద్మావతి, సీడీపీఓ, మహిళా, శిశు సంక్షేమ, శంఖవరం

రీజియన్–2లో టెన్త్‌కు 1.77 లక్షల మంది విద్యార్థులు

- గతానికి భిన్నంగా పరీక్షలకు కట్టుదిట్టమైన చర్యలు
- 19 నుంచి మూల్యాంకనం
- పాఠశాల విద్య ఆర్‌జేడీ నాగమణి



రాయవరం పరీక్ష కేంద్రం వద్ద ఎంఈఓ సత్యనారాయణకు సూచనలిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

రాయవరం: పాఠశాల విద్యాశాఖ రీజియన్–2 పరిధిలో 1,77,448 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) జి.నాగమణి తెలిపారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో రాయవరం శ్రీ రామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు కేంద్రాలను ఆమె సోమవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో తీసుకున్న చర్యలపై ఎంఈఓ సత్యనారాయణను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ, రీజియన్–2 పరిధిలో కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడు జిల్లాల్లోని 2,964 పాఠశాలల నుంచి 91,476 మంది బాలురు, 85,672 మంది బాలికలు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు.

విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. 911 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటిలో 226 ఎ, 413 బి, 272 సి కేటగిరీ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కూడా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేని విధంగా పరీక్షలకు గతంలో ఎన్నడూ లేని విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. పరీక్షల అనంతరం ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకూ ఆయా జిల్లా కేంద్రాల్లో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి ఏర్పాట్లు చేశామన్నారు. మూల్యాంకన కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి ఒక రోజు ఓరియెంటేషన్ తరగతి నిర్వహించామని నాగమణి తెలిపారు.

శ్రీనివాసా.. గోవిందా..



పొన్న వాహనంపై స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

- పొన్న వాహనంపై దర్శనమిచ్చిన వెంకటేశ్వరస్వామి
- వాడపల్లిలో కొనసాగుతున్న కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం: కల్యాణోత్సవాల్లో భాగంగా వాడపల్లి శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారు సోమవారం పొన్న వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లను పొన్నవాహనంపై కొలువుదీర్చి, గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకుని, ఉత్సవాలు తిలకించారు. ఉదయం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పూర్ణాహుతి, బాలభోగం, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఆవరణలో కళాకారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. భక్తులకు భారీగా అన్న సమారాధన నిర్వహించారు.

కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారికి మంగళవారం సదస్యం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.



అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

ఆఖరి మజిలీలో అన్నీ తానై..

- తల్లి మృతదేహానికి ట్రాన్స్‌జెండర్ అంత్యక్రియలు
- ఆఖరి చూపూ అక్కర్లేదంటూ వదిలేసిన కొడుకులు, బంధువులు



ప్రభావతి మృతదేహాన్ని ఖననం చేస్తున్న కావ్య

కాకినాడ క్రైం: నవమాసాలూ మోసి, కని పెంచిన కొడుకులున్నారు.. అయినవారందరూ ఉన్నారు.. అయినా ఆఖరి మజిలీలో ఆ తల్లిని పట్టించుకోలేదు. కడసారి చూపు కూడా వద్దనుకున్నారు.. దీంతో అన్నీ తానే అయి ఓ ట్రాన్స్‌జెండర్ ఆ పిచ్చితల్లికి అంతిమ సంస్కారం చేసింది. వివరాలివీ.. కాకినాడ పర్లోవపేటలోని రాజీవ్ గృహకల్ప ఫ్లాట్ నంబర్–8లో యల్ల ప్రభావతి (50) నివాసం ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కొన్నేళ్ల క్రితం కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడు. చిన్న కుమారుడు దుర్గాప్రసాద్ దంపతులకు ఏడేళ్ల కుమారుడు లక్కీ ఉన్నాడు. భర్త బాధ్యతారాహిత్యాన్ని భరించలేక దుర్గాప్రసాద్ భార్య లక్ష్మి మరొకరితో వెళ్లిపోయింది. అప్పటి నుంచీ మనవడు లక్కీ, కొడుకు దుర్గాప్రసాద్‌తో కలిసి ప్రభావతి జీవిస్తోంది. ఈ నేపథ్యంలో పది రోజుల క్రితం దుర్గాప్రసాద్ కూడా వారిని వదిలిపెట్టి ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. మనవడు లక్కీ అంటే ప్రభావతికి ప్రాణం. మనవడికి ఏ లోటూ రానిచ్చేది కాదు. తాను తిన్నా తినకపోయినా తనకు వచ్చే వైఎస్సార్ వితంతు పెన్షన్‌తో ఉన్నంతలోనే ఆ పసివాడిని కంటికి రెప్పలా చూసుకునేది. ఇది చూసి చుట్టుపక్కల వారు అబ్బురపడేవారు.

ఇదిలా ఉండగా, గత నెల 30వ తేదీన కోడలు లక్ష్మి ఉన్నట్టుండి వచ్చింది. ఇంట్లోని పలు సామగ్రిని తనవంటూ తీసుకువెళ్లిపోబోయింది. అయితే తమ వద్ద చేసిన అప్పు తీర్చి సామాన్లు తీసుకెళ్లమంటూ ఆమెను చుట్టుపక్కల వారు నిలువరించారు. దీంతో తీవ్ర ఆగ్రహంతో అత్త ప్రభావతితో లక్ష్మి గొడవ పడింది. కావాలనే అప్పుల వాళ్లను పిలిచావంటూ మండిపడింది. తగిన శాస్తి చేస్తానని బెదిరించింది. తను కన్న కొడుకు లక్కీని తనకు ఇచ్చేయమంటూ పట్టుబట్టింది. బలవంతంగా తీసుకెళ్లిపోతుంటే ప్రభావతి ఏడుస్తూ కాళ్లావేళ్లా పడింది. చుట్టుపక్కల వారు అడ్డుకునే ప్రయత్నం చేసినా, తన కొడుకునే తీసుకువెళ్తున్నానంటూ లక్కీని తీసుకుని లక్ష్మి వెళ్లిపోయింది. మనవడిపై బెంగతో ఏడుస్తున్న ప్రభావతిని ఇరుగుపొరుగు వారు రాత్రి ఓదార్చి పడుకోమని చెప్పి వెళ్లారు. ఉదయం చూసేసరికి ప్రభావతి ఇంట్లో విగతజీవిగా కనిపించింది. పక్కనే ఉన్న గ్లాసులో మామిడి కాయలు మగ్గించే కాల్షియం కార్బయిడ్ ద్రావణాన్ని గుర్తించారు. ఆమె మృతి విషయం ఆ ప్రాంతంలో అందరికీ తెలిసినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. సమాచారం ఇచ్చినా సమీపంలోని బంధువులూ రాలేదు.

అదే ఫ్లాట్ సమీపంలో ట్రాన్స్‌జెండర్ కావ్య నివాసం ఉంటోంది. ప్రభావతి దుస్థితి గమనించి చలించిపోయింది. జరిగిందంతా హైదరాబాద్‌లో ఉంటున్న సర్వీస్ హార్ట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు ఆనంద్‌కు ఫోన్‌లో వివరించి, సహాయం కోసం అర్థించింది. ఆయన సూచనల మేరకు ప్రభావతి మృతదేహాన్ని కాకినాడ పోర్టు పోలీస్ స్టేషన్‌కు అంబులెన్సులో తీసుకెళ్లింది. ప్రభావతి మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జీజీహెచ్‌కు తరలించాలని సూచించారు. వారి సూచనల మేరకు ప్రభావతి మృతదేహాన్ని కావ్య జీజీహెచ్ మార్చురీకి తరలించింది. తల్లి మరణంపై కుమారుడికి పోలీసులు సమాచారం ఇచ్చినా రాలేనని చెప్పాడు. సమీప బంధువులు, రక్త సంబంధీకుల రాక కోసం ఎదురు చూశారు. ఏ ఒక్కరూ రాకపోవడంతో ఫోరెన్సిక్ వైద్యులు ప్రభావతి మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని అంబులెన్స్ డ్రైవర్ సాయంతో కాకినాడ బస్టాండు వద్ద ఉన్న శ్మశాన వాటికకు కావ్య తరలించింది. ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అంబేడ్కర్ సాయంతో ప్రభావతి మృతదేహాన్ని ఖననం చేసింది.

నమ్మించి.. వంచించి..

- 4.50 కిలోల బంగారు నగలు మాయం చేసింది గుమస్తాయే..
- ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు

కొవ్వూరు: పట్టణంలో చేపబొమ్మ వీధిలోని బంగారు నగల తనఖా దుకాణం(పాన్ బ్రోకర్)లో 4.50 కేజీల బంగారు నగలు మాయం కావడం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం వెలుగు చూడటంతో తనఖాదారుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఘటనపై దుకాణ యజమాని కితేష్ కుమార్ జైన్ ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ కేసు నమోదు చేశారు. ఇదే షాపులో పని చేస్తున్న శెట్టి రాము అనే వ్యక్తిని నిందితుడిగా భావిస్తున్నారు. అతడు ఎనిమిదేళ్లుగా ఇక్కడే పని చేస్తున్నాడని చెబుతున్నారు. రామును విశ్వసించడంతో జైన్ తాళాలు సైతం అతనికే ఇచ్చేవాడంటున్నారు. తనపై యజమానికి ఉన్న నమ్మకాన్ని అడ్డం పెట్టుకుని దశల వారీగా రాము నగలు మాయం చేసినట్టు పోలీసుల ప్రాథమికంగా నిర్ధారించారు. అతడు తన అవసరాలకు కొన్ని నగలు తీసుకువెళ్లి వేరొకచోట తనఖా పెట్టి సొమ్ములు తీసుకున్నట్టు గుర్తించారు. ఇప్పటికే రాము ఐదారుచోట్ల నగలు తనఖా పెట్టినట్టు సమాచారం. ఇదే దుకాణ యజమాని వద్ద సుమారు ఇరవై ఐదేళ్లు పాటు పని చేసిన ఓ గుమస్తా కూడా గతంలో సుమారు రూ.25 లక్షల వరకూ మోసం చేశాడని తెలిసింది. తాజా కేసును డీఎస్పీ వీవీఎస్ వర్మ సవాల్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. జైన్, ఆయన కుమారుడు అకౌంట్లు చూసుకునే నిమిత్తం నగలు బయటకు తీయడంతో అవి మాయమైన విషయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు.